క్లుప్తంగా

ముగిసిన కరాటే శిక్షణ శిబిరం



ప్రశంసా పత్రాలతో కరాటే విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక సాయిబాబానగర్‌లో శ్రీశైల పాఠశాలలో నెల రోజుల పాటు నంద్యాల జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి కరాటే శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహాన్ సైక్ నూర్‌బాషా మాట్లాడుతూ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 14వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సోమశేఖర్‌రెడ్డి, నేషనల్ కంప్యూటర్ వ్యవస్థాపకుడు గురుమూర్తి, రియాజ్‌బాషా హాజరై శిబిరంలో ప్రతిభ చూపిన ఐదుగురికి ఎల్లో బెల్ట్‌లు, 10మందికి ఆరెంజ్ బెల్ట్, 11మందికి గ్రీన్ బెల్ట్, ప్రశంసా పత్రాలు అందజేశారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

రొటేరియన్‌కు సన్మానం



బాలకృష్ణను సన్మానిస్తున్న రొటేరియన్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): రొటేరియన్ కామిని బాలకృష్ణను నంద్యాల రోటరీ క్లబ్ సభ్యులు ఆదివారం స్థానిక కార్యాలయంలో సన్మానించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు కైలాసనాథరెడ్డి మాట్లాడుతూ క్లబ్ ద్వారా విశిష్ట సేవలు అందించిన బాలకృష్ణను సత్కరించామన్నారు. అలాగే గాజులపల్లెలోని దేవాలయానికి మైక్ సెట్ విరాళంగా అందజేశామన్నారు. సభ్యులు విజయశేఖర్‌రెడ్డి, కల్లూరు రామలింగారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, అనిల్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

నంద్యాల ఎంపీడీఓగా సుగుణశ్రీ

నంద్యాల(రూరల్): నంద్యాల మండల ఎంపీడీఓగా సుగుణశ్రీని జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు సాధారణ బదిలీల్లో భాగంగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ గుర్రాల భాస్కర్‌ను గోస్పాడు మండలానికి, అక్కడ పని చేస్తున్న సుగుణశ్రీని నంద్యాలకు బదిలీ చేశారు. నేడు ఆమె బాధ్యతలు చేపట్టనున్నారని కార్యాలయ ఏఓ వెంకటప్రసాదరెడ్డి ఆదివారం తెలిపారు.

అహోబిలంలో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మూలమూర్తులకు నిత్యపూజల అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమే త శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయం ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి దూపదీపాలతో మహామంగళహారతి అనంతరం నైవేద్యం నివేదించారు. రాత్రి విశేషాలంకరణలో స్వామి ఉభయ దేవేరులతో కొలువుదీరి మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఆల యం చేరుకున్న అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యాక్రమాన్ని ముగించారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు అమ్మవారిని దర్శించుకోని చీర,సారె, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత జగనన్నదే

నంద్యాల(సిటీ): పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని 36వ వార్డు కౌన్సిలర్ శిల్పా నాగిని రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వార్డులో అర్హులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. మొత్తం 47 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాంశావలి, నాయకులు జయప్రకాశ్ పాల్గొన్నారు.



అర్హులకు ఇళ్ల పట్టాలు అందజేసిన నాగినిరెడ్డి

ఆదర్శ పాఠశాలలు ఆహ్వానిస్తున్నాయ్..

- ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రతిభ గల విద్యార్థులకు ప్రాధాన్యత

నంద్యాల(న్యూటౌన్): పేదలకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను స్థాపించింది. ఆంగ్ల మాధ్యమంలో ఉచిత బోధనతో పాటు అధునాతన సౌకర్యాలను అందుబాటులో ఉంచింది. జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల, బండిఆత్మకూరు, బనగాపల్లె, బేతంచెర్ల, గోస్పాడు, మహానంది, అవుకు, పాణ్యం రుద్రవరం, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, తదితర ప్రాంతాల్లో ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి.

6వ తరగతిలో ప్రవేశాలకు..

దరఖాస్తు చేసుకునే ఓసీ, బీసీ విద్యార్థులు 2011 నుంచి 2013 సంవత్సరాల మధ్య, ఎస్సీ, ఎస్టీల వారు 2009 నుంచి 2013 మధ్య పుట్టిన వారు అర్హులు.



గోస్పాడులోని ఆదర్శ పాఠశాల

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150 రుసుము ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదివి ఉండాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులు రావాలి. ప్రతిభా ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల మేరకు విద్యార్థులను ఎంపిక చేస్తారు. 6వ తరగతికి ఒక్కో పాఠశాలలో 100 సీట్లు ఉంటాయి.

ఇంటర్మీడియెట్‌లో..

ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదవ తరగతి చదివి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించాలి. ఈనెల 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. దరఖాస్తు పత్రాలను ఆయా ఆదర్శ పాఠశాలల్లో సమర్పించాలి. పదో తరగతి మార్కులు, ప్రతిభా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఒక్కో ఆదర్శ పాఠశాలలో 160 సీట్లు ఉంటాయి.

దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలి



https://apms.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొందవచ్చు. తొలుత పేమెంట్ గేట్‌వే ద్వారా అప్లికేషన్ రుసుము చెల్లించి అక్కడ వచ్చే నంబరుతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు పూర్తి చేసుకున్న తర్వాత ఆయా ఆదర్శ పాఠశాలలో సమర్పించాలి. మరిన్ని వివరాలకు సమీపంలోని పాఠశాలలో లేదా ఎంఈఓలను సంప్రదించాలి.

– అనురాధ, డీఈఓ, నంద్యాల

నేటి..సమాచారం

హరివరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి రమేష్‌చంద్ర బాలాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి వైద్య బృందం 104 వాహనంలో ఉదయం 9 గంటలకు చేరుకుని సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

'స్పందన'

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో కూడా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అక్కడ పరిష్కారం కాని సమస్యలను మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అర్జీ అందజేయాలని సూచించారు.

వైభవంగా శ్రీవారి జేష్టాభిషేకం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయం వెలసిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి వారికి జేష్టాభిషేక మహోత్సవాన్ని శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ శాస్త్రోక్తంగా జరిపించారు. వేదపండితులు శ్రీకాంత్‌శర్మ మాట్లాడుతూ లోక కల్యాణం కోసం సకల నక్షత్ర దోష నివారార్థం కార్యక్రమం చేపట్టామన్నారు.



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం,ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

ఏరువాక సాగాలో..

దొర్నిపాడు: జ్యేష్ట శుద్ధ పూర్ణిమను రైతులు ఏరువాక పున్నమిగా జరుపుకుంటారు. ఈ రోజును రైతులు పవిత్రమైన రోజుగా భావిస్తారు. మండే ఎండలకు వీడ్కోలు పలుకుతూ చిరుజల్లులతో నేల తల్లి పులకించే క్షణాలివి. ఇందులో భాగంగా ఆదివారం ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని సేద్యపు పనులను ప్రారంభించారు. మొత్తానికి వర్షాకాలంలో తొలినాలల్లో వ్యవసాయం మొదలు పెట్టడం అని, ఏరు అంటే దున్నడానికి సిద్ధం చేస్తున్న నాగలి అని, వాక దున్నడానికి ప్రారంభం అని చెబుతారు రైతులు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మంచి పంట దిగుబడులు దక్కాలని రైతులు పుడమి తల్లికి, కాడెద్దులకు పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించారు.



దొర్నిపాడులో ఒట్టి సేద్యం పనులు చేస్తున్న రైతు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ఇంజేడులో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె, ఇంజేడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు శాస్త్రోక్తంగా సాగుతున్నాయి. ఆదివారం వేద పండితులు వెల్లాల వెంకటశేషయ్య శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజలతో ప్రారంభించి యంత్రాభిషేకం, ఆవాహిత దేవతా హోమాలు, మండప ఆరాధన, దాన్యాధివాసం, పుష్పధివాసం, విగ్రహ ప్రతిమలకు గ్రామోత్సవం వంటి కార్యక్రమాలు చేపట్టారు. అవాంఛి రామమోహన్‌శర్మ, ఇందిరకంటి శశికాంత్ శర్మ, మురళీధర్‌రావు, అనంతయ్య, పండితులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేలా శాసన సభలో చేసిన తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర స్థాయి జీపీఎస్ నాయకులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చాలను కోవడం దారుణమన్నారు. జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జుననాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, వెంకటేష్‌నాయక్, రామచంద్ర నాయక్, రవినాయక్ పాల్గొన్నారు.

కొండాపురంలో అంధకారం

దొర్నిపాడు: మండలంలోని కొండాపురం గ్రామంలోని మసీదు కాలనీలో రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేక అంధకారం నెలకొన్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటిపై విద్యుత్ తీగలు వెళ్లాయని కట్ చేయడంతో సరఫరా నిలిచి పోయింది. దీంతో పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు జోక్యం చేసుకున్నా ఫలితం లేకపోయిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

కలెక్టర్ నిర్ణయం హర్షణీయం

నంద్యాల(న్యూటౌన్): నకిలీ విత్తనాలు, ఎరువులను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తీసుకున్న నిర్ణయంపై సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నకిలీ కల్తీ విత్తనాలను, ఎరువులను అరికట్టేందుకు షాపులను ఆకస్మికంగా తనిఖీ చేయడం అభినందనీయమన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహానంది డీఆర్‌ఓ సుబ్బయ్య బదిలీ

మహానంది: అటవీశాఖ మహానంది డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సుబ్బయ్యను బదిలీ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆదివారం తెలిసింది. ఆయనను బనగానపల్లెకు బదిలీ చేస్తూ అక్కడ డీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న హైమావతిని మహానంది డీఆర్‌ఓగా విధులు కేటాయించినట్లు తెలిసింది. ఈ మేరకు త్వరలోనే ఆమె మహానంది డీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

వెదుర్ల వేలాలు వాయిదా

మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ డిపోలో ప్రతి నెల 4వ తేదీన నిర్వహించాల్సిన వెదుర్ల వేలాలు ఆదివారం కావడంతో వాయిదాపడ్డాయి. సాధారణంగా ప్రతి నెలలో 4, 17వ తేదీల్లో వెదుర్లు, కలపను డీఎఫ్‌ఓ, ఎఫ్‌ఆర్‌ఓల ఆధ్వర్యంలో బహిరంగ వేలాలు నిర్వహిస్తారు. ఆదివారం సెలవు కావడంతో ఈ నెల 6వ తేదీన వేలాలు నిర్వహించనున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



గుంతల్లో వర్షపు నీరు నిలిచిన దృశ్యం,



కొత్తగా వేసిన తారురోడ్డు

రుద్రవరం: మండలంలోని పెద్దకంబలూరు నుంచి మెట్ట వరకు రూ.70లక్షలతో తారు రోడ్డు వేశారు. దీంతో ఆ గ్రామస్తులకు కాలినడక,వాహనాల వాహన రాకపోకలు రయ్ మంటూ సాగుతున్నాయి. గతంలో ఆ రోడ్డు అధ్వానంగా ఉండేది. తారు రోడ్డు ఉన్నప్పటికీ గుంతలు పడి శిథిలమైంది. వర్షాకాలం వస్తే ఆ గుంతల్లో నీరు నిలిచిపోవడంతో గుంతల లోతు తెలియక వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఇక ద్విచక్ర వాహనదారులు కిందపడిన సంఘటనలు కోకొల్లలు. పొలాల నుంచి ధాన్యం దిగుబడులు, ఎడ్ల బండ్లపై ఎరువులు, ఇతర బరువులు ఎత్తుకెళ్లే వాహనాలు ఆ గుంతల రోడ్డుపై వెళ్లలేక ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం. టీడీపీ హయాంలో రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎన్నోమార్లు గ్రామస్తులు అప్పటి పాలకుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఫలితం లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామస్తులు రోడ్డు సమసమస్యను మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి రూ.70లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులతో మెట్ట నుంచి గ్రామంలోకి దాదాపు 3కి.మీ దూరం తారురోడ్డు వేయించి సమస్యను పరిష్కరించారు.

పర్యావరణంతో ఆరోగ్యకరమైన సమాజం

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజం అందుబాటులో ఉంటుందని అటవీ అధికారి ముర్తుజావలి పేర్కొన్నారు. ఆదివారం దిగువ అహోబిలం కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఆవరణలో భక్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నీటి సంరక్షణ, ఇంధన, విద్యుత్ ఆదా పాటించాలని కోరారు.

ఘనంగా మహిళా సమాఖ్య దినోత్సవం

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య 69వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు స్థానిక సీపీఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళలకు న్యాయం చేయడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని సూచించారు. దేశ కీర్తిని చాటిన క్రీడాకారిణులను వేధించిన ఎంపీపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం ప్రదర్శించడం దుర్మార్గమన్నారు. సమాఖ్య కార్యదర్శి లక్ష్మీదేవమ్మ, ఏఐటీయూసీ నంద్యాల కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

శిరివెళ్ల: వీరారెడ్డిపల్లెకు చెందిన అజరయ్యపై దాడి జరిగిందని ఎస్‌ఐ సురేష్ ఆదివారం తెలిపారు. ఓ మహిళ విషయంపై ఈ నెల 3న దానమయ్య, యోహాన్ కుమారి, మరియమ్మ, మరో వ్యక్తి కలిసి అజరయ్యపై దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. బాధితుడి భార్య ప్రభావతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పదోన్నతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): ఖాళీగా ఉన్న జూనియర్ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులను ఉపాధ్యాయుల పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయులకు జేఎల్ ప్రమోషన్లు కల్పించాలని, ఉపాధ్యాయులు సంవత్సరాల పాటు ఒకే కేడర్‌లో పని చేస్తున్నారని గుర్తు చేశారు. జూనియర్ లెక్చరర్లుగా నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు అవకాశం కల్పిస్తుండటం సరికాదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, రాజు, ఉపాధ్యక్షుడు దేవేంద్రుడు, భాస్కర్, రాజశేఖర్, హరికృష్ణ, ప్రతాప్ పాల్గొన్నారు.

పాదరక్షల పంపిణీ

ఆళ్లగడ్డ: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఆవోపా ఆధ్వర్యంలో పాదరక్షలు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ రమేష్‌బాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆవోపా కన్వీనర్ డాక్టర్ ప్రభాకర్‌రావు కార్మికులకు పాదరక్షలు అందజేశారు. నాయకులు వినోద్, డాక్టర్ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఒడిశా రైలు ప్రమాదం మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ ఆర్‌ఐ జిల్లా కార్యదర్శి గాలిరవిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రైలు ప్రమాదాలు జరగకుండా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంపీపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): మహిళా రెజర్ల పట్ల అనుచితంగా ప్రవర్తించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం కార్యాలయం నుంచి సాయిబాబానగర్ వరకు ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆవాజ్ కమిటీ నంద్యాల జిల్లా కార్యదర్శి మస్తాన్‌వలి మాట్లాడుతూ క్రీడాకారిణులకు మద్దతు తెలియజేశారు. బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. బాబుల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: ఓంకారం క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేసవి సెలవులు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకం, అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన పూజలు చేపట్టారు.

రూ.2.80 కోట్ల నష్ట పరిహారం మంజూరు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

చాగలమర్రి: ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో ఈ ఏడాది మార్చి నెలలో కురిసిన అకాల వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోయిన రైతులకు రూ.2.80 కోట్ల నష్టపరిహారం మంజూరైందని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని తోడేండ్లపల్లి గ్రామంలో ఎంపీపీ వీరభద్రుడు ఆధ్వర్యంలో పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబునాయుడు ఇప్పుడు దొంగ హామీలిస్తున్నాడని, గతంలో రైతులకు రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందో రైతులకు తెలుసునన్నారు. ఆయన అసత్య వాగ్దానాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, నాయకులు గొట్లూరు సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి గణేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ షేక్ సోహెల్, మనోహర్ రెడ్డి, ముల్లా ఖాదర్‌బాషా, రామగురివిరెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల పది, ఇంటర్ తరగతుల్లో అత్యధిక మార్కులు సాధించిన పద్మశాలీయ విద్యార్థులకు పబ్బు తులసీ కృష్ణ పద్మశాలీయ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కార్యాలయంలో పబ్బు తులసీ కృష్ణ పురస్కారాలు అందజేశారు. అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు వెండి మెమొంటో, పుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే ఆర్థిక స్థోమత లేని మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.10వేల చొప్పున అందజేశారు. సంఘం నాయకులు బాలవెంకటసుబ్బయ్య, మాజీ కౌన్సిలర్, భీమునిపల్లె వెంకటసుబ్బయ్య, చెన్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

మహానందిలో త్వరలో గర్భాలయ గోపుర కలశ ప్రతిష్ఠ



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న కలశం

మహానంది: మహానందిలో త్వరలో గర్భాలయ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గాజులపల్లె ఆర్‌ఎస్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర స్వామి, నవగ్రహాల ఆలయాల వ్యవస్థాపకులు మస్తాన్‌రావు సహకారంతో గోపుర కలశాలకు బంగారు తాపడం చేయించామన్నారు. కంచి కామకోటి పీఠాధిపతులతో చర్చించి త్వరలో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కలశప్రతిష్ఠ ఉత్సవంతో పాటు కుంభాభిషేకం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. టీటీడీ నుంచి మంజూరైన రూ.4.60కోట్లతో వసతిగృహాల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని, వీటితో పాటు రూ.80లక్షలతో కోనేరుల ఆధునికీకరణ పనులు సైతం ప్రారంభించినట్లు వివరించారు.

రెండు కార్లు ఢీ...తప్పిన పెనుప్రమాదం



రెండు కార్లు ఢీకొన్న దృశ్యం

మహానంది: రెండు కార్లు ఢీ కొనడంతో పెద్ద ప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం బోయిలకుంట్ల మెట్ట వద్ద చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన రవికిరణ్, కుటుంబ సభ్యులు బోయిలకుంట్ల నుంచి కారులో మహానంది వైపు వస్తుండగా, నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వెళ్తున్న కరీంనగర్‌కు చెందిన ఓదేలు కారు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో కరీంనగర్‌కు చెందిన కారుడ్రైవర్ కుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు కార్లు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పోలీసు సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి వివరాలు సేకరించారు. ఎలాంటి కేసు నమోదు కాలేదని తెలిపారు.

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.



పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు,ఈఓ

సమస్తం.. ప్రకృతి మయం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ 3650 ఆవాలతో ప్రకృతి మాత ఊహా చిత్రాన్ని గీచారు. 0.2 ఎం.ఎం సైజులతో ఆవ గింజలతో డ్రాయింగ్ షీట్‌పై ఆవాలను అతికిస్తూ ప్రపంచ ప్రకృతి మాత, భూమి, చెట్లు, నీరు, సర్పాలు, మొసలి, కంగారు, ఏనుగు తదితర జంతువులు సేవ్ ట్రీస్, సేవ్ వాటర్ ఇలా ఎన్నో చిత్రాలు గీచి అబ్బుర పరిచారు. ప్రతి ఆవ గింజపైమైక్రో బ్రెష్‌తో చెట్టు చిత్రాన్ని వేశారు. మైక్రో ఆర్ట్‌ను తయారు చేయడానికి 7గంటల సమయం పట్టిందని, ప్రపంచ జనాభా పెరగడంతో సహజ వనరులు తగ్గి వాతావరణంలో మార్పులు వచ్చాయని, దానికి అనుగుణంగా చిత్రాన్ని గీచినట్లు చింతలపల్లె కోటేష్ తెలిపారు.

– నంద్యాల(అర్బన్)



ప్రకృతి మాత ఊహా చిత్రం